
ఒంటరి ఆడదానిపై తుంటరి చూపులు చూసి చేయివేసే మనస్తత్వాన్ని అడ్డుకోవాలంటే ఒక మగాడి అండ అవసరం అంటుంది కథానాయిక - మళ్ళీ అదే ట్రాప్-

# “ట్రాప్”

దివాకర్ బాబు



“కొత్త పాంచాలి దొరికింది ఫ్రెండ్స్” అంటూ హఠాత్తుగా వూడిపడ్డ సూర్యం వంక అక్కడున్న నలుగురూ కుతూహలంగా చూశారు. సూర్యం వాళ్ళ కుతూహలాన్ని గమనిస్తూ. హాంకీతో ముఖం తుడుచుకుంటూ కుర్చీలో కూర్చున్నాడు. అతని కళ్ళు వింతగా మెరుస్తున్నాయి.

అద్దె కొచ్చిన ఆడదాన్లాగా నిలబడివుంది టీపాయ్‌మీద ట్రిబులెక్స్ “రమ్” ఫుల్ బాటిల్. అంతవరకూ సూర్యంకోసం ఎదురుచూస్తున్న అందరికీ సూర్యం రాక సంతోషాన్ని కలిగించింది. అదీకాక వస్తూనే అతనన్న మాటలు వాళ్ళమీద బీ కాంప్లెక్స్ ఇంజక్షన్లా పని చేస్తున్నాయి. అంతవరకూ అణిచి పెట్టుకున్న కోర్కెని ఆపుకోలేక జోసెఫ్ బాటిల్ ఓపెన్‌చేసేడు. అందుకోసమే ఎదురు చూస్తున్న శర్మ ఐస్ ముక్కల్ని సిద్ధంచేశాడు. సోడాలు కొట్టేపని ఖాసిం తీసుకున్నాడు. టీపాయ్ మీద అంతకు ముందునుంచే జీడిపప్పు, చిప్స్ వెయిట్ చేస్తున్నాయి. జయరాజ్ బుర్ర సూర్యం చెప్పిన పాంచాలి గురించి వీలైనన్ని ఆలోచనలు చేస్తోంది.

“ఛీర్స్.”

గ్లాసులు నాజూగ్గా ముద్దు పెట్టుకున్నాయి.

సిగరెట్లు వెలిగాయి.

“ఒన్స్ ఎగైన్ ఛీర్స్.”

“ఫర్ ది హెల్త్ ఆఫ్.......” నాలుగు గొంతులూ ఒకేసారి పలికాయి.

ఎనిమిది కళ్లూ సూర్యంవైపు చూశాయి.

సూర్యం నవ్వేడు సున్నితంగా.

ఆ నవ్వు కన్నెపిల్లల గుండెల్ని కదిలించేయగలదు.

“పాంచాలి” సూర్యం గొంతు విచిత్రంగా ధ్వనించింది!

అందరి గొంతుల్లో రమ్!

అందరి బుర్రల్లో పాంచాలి!!

* * *

వాళ్ళు అయిదుగురు. అయిదుగురికీ ఒకే రూమూ, వేరువేరు ఇళ్ళూ వున్నాయి. ఇళ్ళల్లో ఇద్దరికి భార్యలూ- కన్నవాళ్ళూ తోబుట్టువులూ అందరికీ వున్నారు. ఉద్యోగాలు చెయ్యకుండా, బిర్లా బావమరుదుల్లా గడిపేయగల ఆస్తులున్నాయి.

ట్రిబులెక్స్ రమ్ముల్నీ, ఏజ్‌లెస్ గుమ్మల్నీ తనపర భేదం లేకుండా పంచు

కు ని అనుభవించేయగల సంస్కారం(!) వాళ్ళకుంది? మ్యూచివల్ అండర్ స్టాండింగ్(!)తో స్నేహాన్ని అభివృద్ధిచేసుకుంటున్న కల్చర్డ్ పీపుల్, అలా అని చెప్పి సొంత భార్యల్ని పరాయి వాళ్ళకి అప్ప చెప్పే నీచులుకారు వాళ్ళు(?)

* * *

రౌండ్ పూర్తయింది; చేతివేళ్ళ మధ్య కాలుతున్న సిగరెట్లూ, గుండెల్లో కాల్చేస్తున్న కోర్కె - వాళ్ళ పరిస్థితి అది;

సెకండ్ రౌండ్‌కి సన్నాహాలు చేస్తూ, "గురూ, ఇక భారతం మొదలెట్టేయి. ఆలస్యాన్ని భరించటం అంటే, ఆడది లేకుండా పడుకున్న రాత్రిలా గుబులుగా వుంటుంది" అన్నాడు శర్మ కనుబొమలు తమాషాగా ఎగరేస్తూ.

శర్మ మాటలకి నవ్వాడు ఖాసిం, "క్యా భాయ్— నీ మతిగానీ సీసాలో పెట్టి మూతే కావా కొంపదీసి!.... నీకంతగా భారతం వినాలనుంటే వెంకాయమ్మ వుంచుకున్న శాస్త్రుల్నడుగు చెప్తాడు."

"నాన్‌సెన్స్.... సోఫియాలారెన్ గురించో, ఎలిజబిత్ టేలర్ గురించో మాట్లాడవలసిన టైమ్‌లో.... భారతం ఏవిటోయ్.... నీలాంటివాడే వెనకటికి వ్యభిచారం చేస్తూ 'మడి' అన్నాట్ట" జోసఫ్ సీరియస్‌గానే అన్నాడు.

సిగరెట్ గది మూలకి విసిరేస్తూ శర్మ పెద్దగా నవ్వాడు "ఓరి, బడుద్ధాయిలూ.... నేను కాల్చే సిగరెట్ ఖరీదు చెయ్యావు మీ బ్రెయిన్స్.... మీరు నన్ను కామెంట్ చేస్తార్రా!...చెప్తావినండి ..అవర్ లెర్నెడ్ ఫ్రెండ్ సూర్యం చెప్పిందెవరి గురించి?. పాంచాలి అనబడే ఆడకూతురు గురించి అవునా! పాంచాలి భారతంలో అయిదుగుర్ని అగ్ని సాక్షిగా లవ్ ఆడేసిన పతివ్రత....అర్థం అయిందా....కాకపోతే కల్తీ సారాతాగి చావండి...."

"స్టాప్ టాకింగ్ ఐసే" జయరాజ్ సూర్యం వంక చూసేడు ప్రారంభించమన్నట్లు.

సూర్యం గొంతు సవరించుకున్నాడు. "శోభారాణి అని...." రెస్పాన్స్ కోసం మిత్రులవంక చూశాడు.

"ప్రొసీడ్..." నలుగురు ఒకేసారి అన్నారు.

"శోభారాణి.... ఐ మీన్.... కాబోయే మన పాంచాలి, మా ప్రక్కింట్లో రూమ్ తీసుకుంది...."

"డేరింగ్ డార్లింగ్" జోసఫ్ చేసిన కామెంట్‌ని ఎవ్వరూ పట్టించుకోలేదు. కానీ జోసఫ్ వంక సీరియస్‌గా చూశాడు ఖాసిం.


ప్రసిద్ధి గాంచిన అజంతా ఎల్లోరా శిల్ప సౌందర్యానికి

సరితూగే VIMAL (A RELIANCE PRODUCT) వస్త్ర సంపదను

ఆ రా ధ న

షోరూంలో చూడండి

శ్రీ లక్ష్మి క్లాత్ స్టోర్స్ ఎదురుగా, కొత్తగూడెం.

(B. A. P.)



# మీరు నిరుద్యోగులా?

## మీ సమస్యకు తక్షణ పరిష్కారం నాయుడు సేవింగ్స్.

మా స్కీములో మీరు చేర్పవలసిన కనీస మెంబర్లు 5 గురు మాత్రమే!

నెలకు రు. 1000/- నుండి రు. 2000/- వరకు ఆర్జించవచ్చును.
మెంబరుకు వచ్చిన బహుమతులపై 3% కమీషను లభించును.
మా స్కీములో ఏజంట్లు కొరకు రు. 15,00,000 కమీషనుగా కేటాయించబడినది.
అంతే కాకుండా..........
ఏజంటుకు రాలీస్ సైకిల్సు, సువేగా మోపెడ్‌లు, విజయ్ డీలక్సు స్కూటర్లు ఉచితముగా ఇవ్వబడును.

"చందు గ్రూప్"లో బ్యాంక్ గ్యారంటి సౌకర్యం గలదు.

ఏజన్సీలు అతి పరిమితము!

ఈ రోజే మీ ఏరియాలో ఏజన్సీ, ఏజన్సీ ఆఫీసులకై దరఖాస్తు చేయండి

మీ ప్రాంతీయ పొదుపు సంస్థ

NAIDU SAVINGS PRIVATE LTD

నాయుడు సేవింగ్స్ [ప్రై] లిమిటెడ్.,

మెయిన్ రోడ్డు, విశాఖపట్నం-530001.

* ఆకర్షణీయమైన కమీషన్‌లపై ఏజన్సీలు కోరబడుచున్నవి.
* ఇది ఒక ప్రకటన మాత్రమే.

# వైరు (Weir)

## (నగ్నమునికి)

ఊరవతల గెంతే
వైరు జలపాతపు నాట్యం
ఏకాంతపు సాయంత్రాల్లో
ఆకర్షిస్తుంది నన్ను.

ఎన్నో లాకుల కావల పుట్టి
దేన్నో వెతుకుతూ వచ్చిన కాలవకి
తనని పిలిచినదేదో
దర్శనమిచ్చినట్లుంది.

అలల అలజడులన్నీ
అణగారిపోయి, శాంతంగా,
ఆకాశపు కడుపుతో
ఆకస్మాత్తుగా ఉరుకుతుంది.

ఈ ఉరుకుల్లో పరుగులో
ఎండిన నా వేర్లని తడుపుకుని
ఎదనిండా చివురించిన సంధ్యతో
ఇంటికి తిరిగొస్తాను.

ఎండలు ముదిరాక
ఈ మధ్య వెళ్ళిచూస్తే
ఎండిపోయింది జలపాతం,
బండల్ని బైటపెట్టింది:

లాకులు మూసినట్టున్నారు.
దూకుళ్ళకీ పరవళ్ళకీ అడుగున
ఎంత గట్టి గుండెలుండాలో
సుంత బోధపడింది నాకు.

చప్పున మీరు గుర్తుకొచ్చా
రప్పుడు కేశవరావుగారూ!
సహస్ర జలపాతాల పాతాల్ని
సుహాస ఫేనంగా మార్చే

హృదయ దృఢత్వం మీది.
బదుకులాకుల్ని విప్పేసి మీ
పతనం కోసం వీళ్ళు
పొంచి చూస్తున్నారు.

డంగై వీళ్ళు చూస్తుండగ
చెంగున గెంతండి,
కేశవరావుగారూ!
గుండెల్ని విశాలంగా పరచి
తాండవ నృత్యం చెయ్యండి.

జలపాతమై తలకిందుగా మొలిచి
సంధ్యాకాశంలోకి వేర్లు తన్ని
ఆకాశపు రక్తాన్ని పీల్చండి,
చీకటి లోకంలో జ్వలించండి.

(రచనా కాలం 1976 ఏప్రిల్)

—ఇస్మాయిల్

---

సూర్యం ప్రారంభించాడు, "శోభ.... సారీ మళ్ళీ శోభారాణి అంటున్నాను. పాంచాలి ఏలూర్లో బియ్యే చదివింది.... కాలేజీ నుంచి పరీక్షలు వ్రాసి ఇంటికి రావడమూ, ద్రుపదరాజు (శోభతండ్రి) గుండాగి చచ్చిపోవడమూ ఒకేసారి జరిగాయి."

"పచ్చి తాగుబోతయ్యుంటాడు" శర్మని చూసి నలుగురూ నవ్వారు.

"ఆ తర్వాత పుట్టిపెరిగిన పల్లెటూరి కొచ్చేసింది.... ప్రస్తుతం ఆ అమ్మాయికి రెండెకరాల పొలవూ, బియ్యేలో ఒక పార్టూ, ముసలి నాయనమ్మ తప్ప, 'నా' అని చెప్పుకునేందుకు ఏవీ లేవు. అందువల్ల మిగిలిపోయిన పార్టు పూర్తిచేసి జాబ్ చెయ్యాలన్న వుద్దేశ్యంతో ఇక్కడికి వచ్చింది. అసలు ఏలూరు కాలేజీలోనే పరీక్షలు రాద్దామనుకుందట.. కానీ మన జాతకాలు బాగున్నాయి కాబట్టి సెంటరు మార్చుకుని ఇక్కడికి వచ్చింది.... మరొక ముఖ్య విషయం :- పరీక్షలింకా నెల రోజులున్నాయి. ఈ నెల రోజులూ లెక్చరర్ అప్పారావు దగర ట్యూషన్ చెప్పించుకుంటోంది.." చెప్పటం ముగించి గ్లాసుడు రమ్ గటగటా తాగేశాడు సూర్యం!

"అది మన రూమ్‌కి ఎప్పుడొస్తుంది?"

"జోసఫ్ మరీ అంత తొందర పనికి రాదు...." తాపీగా సిగరెట్టు వెలిగించాడు శర్మ. "సూర్యం ఇన్ని వివరాలు కనుక్కురాగలిగిన నీకు ఇవ్వతగ్గ బిరుదుల్లేనందుకుగానూ చింతిస్తున్నాను."

శర్మ వంక తిరిగి నవ్వాడు సూర్యం.... "ఇప్పుడు పాంచాలి ఇక్కడికి ఎలా వస్తుందో చెప్పవల్సింది జయరాజ్!"

అందరూ చప్పట్లు కొట్టారు. జయరాజ్ లేచి నిలబడ్డాడు. బొంగురు గొంతు అతి నెమ్మదిగా, "నాలుగు రోజులుగా 'పస్తు' పడుకుంటున్న ఈ జీవాలకి, పాంచాలి పేరుతో జీవం పోసిన సూర్యానికి మనం సూర్యనమస్కారాలు చేసినా తప్పులేదు.."

"హియర్.... హియర్"

"సూర్యం.... మిస్ శోభ..ఐ మీన్.. పాంచాలి ఎక్కడ వుంటోందన్నావ్!"

"మా ఇంటి దగ్గర!"

"సో.... మత్స్యయంత్రాన్ని ఛేదించగల్గటం నీవల్లే అవుతుంది. ఆ తర్వాత పాంచాలి మన అయిదుగురి కౌగిళ్ళలో నలుగుతుంది.... జాగ్రత్తగా వినండి.... అందరూ వినండి.... దాన్నెలా "ట్రాప్" చెయ్యాలంటే....

* * *

దేశాన్ని చీకటి రాక్షసి రెండున్నర గంటల క్రితం ఫలహారం చేసింది.

శోభారాణి మళ్ళీ వెనక్కి తిరిగి చూసింది. నలుగురు వ్యక్తులు రావటం గమనించింది.... గుండెలు జలదరించేయి భయంతో. 'స్కౌండ్రల్స్' అనుకుంది. స్కౌండ్రల్స్ నాలుగు రోజుల్నుంచీ శోభారాణి వెంటపడుతున్నారు. రిక్షాదొరుకుతుందేమోనని అటూ ఇటూ చూసింది, రిక్షావాళ్ళ స్ట్రైక్ అని తెలియక. వాళ్ళు నలుగురూ దగ్గరికొచ్చేస్తున్నారు.... 'ఈ చీకట్లో వాళ్ళేమైనా చేస్తే....' నిలువునా వణికిపోయింది. ఈ ఆలోచన రాగానే దాదాపు పరిగెడుతున్నంత వేగంగా నడక సాగించింది.

శోభారాణి పొట్టివాళ్ళల్లో పొడుగ్గా, పొడుగు వాళ్ళల్లో పొట్టిగా వుంటుంది. 'ట్యూషన్ టైమ్ మార్చుకోవాలి. ఈ శని వెధవలెక్కడ దాపురించారు నా ప్రాణానికి. రాస్కెల్స్....' ఉలిక్కిపడింది తన భుజం మీద చెయ్యి వేసిందెవరా అని! గిరుక్కున ఎలక్ట్రిక్ స్పీడ్‌లో వెనక్కి తిరిగింది. ఆ నలుగురు చుట్టూ నిలబడి వున్నారు. అందులో ఒకతను శోభ నడుం చుట్టూ చెయ్యి వేశాడు. నడుముకి పాము చుట్టుకున్నట్లనిపించి కెవ్వున కేక వేసింది శోభారాణి.

పక్కసందులో నుంచి అప్పుడే వచ్చిన స్కూటర్ వాలా, అబల ఆర్తనాదం విని టక్కున స్కూటరాపాడు. స్కూటర్ని చూడటంతోటే ఆ నలుగురూ "నీ అంతు చూస్తాం" అని శోభారాణి చెవులో గొణిగి, పరుగెత్తి పారిపోయారు. శోభారాణి నడిరోడ్డుమీదే కుప్ప కూలిపోయింది. పుస్తకాలు చెల్లాచెదురుగా రోడ్డుమీద పడిపో

యాయి. మోకాళ్ళ మధ్య తలానించి వెక్కి వెక్కి ఏడుస్తున్న శోభారాణి వంక అదోలా చూశాడు స్కూటర్‌వాలా!

"భయపడకండి.... పిరికి వెధవలు పారిపోయారు.... లేవండి.... మిమ్మల్ని ఇంటి దగ్గర డ్రాప్ చేస్తాను?" అంటూనే క్రింద పడిన పుస్తకాలన్నీ ఏరి పట్టుకున్నాడు.

శోభారాణి నెమ్మదిగా తలెత్తి చూసింది! 'ఎక్కడో చూసినట్లుందే' అనుకుంది. లేచి నిలబడి పరీక్షగా చూసింది. 'ప్రక్కింటతను!'

స్కూటర్ మీద కూర్చుని. కొంత దూరం వచ్చాక, "అచ్చం సినిమాలో హీరోలా వచ్చి నన్ను రక్షించారు. థాంక్స్" అని గలగలా నవ్వింది!

అంతకు ముందే భోరున ఏడ్చి, ఏడ్చి జరగనట్లే నవ్వేస్తున్న అమ్మాయి ముఖం చూద్దామనుకొని, ఎదురుగా వస్తున్న లారీని చూసి ఆ పని చెయ్యలేకపోయేడు స్కూటర్‌వాలా!

లారీని దాటేక అడిగేడు. "ఇంతకీ మీ పేరేమిటో చెప్పారు కారు?"

"శోభారాణి.... నా మానాన్నీ తద్వారా నా ప్రాణాన్నీ కాపాడిన మీకు మాత్రం 'శోభా' అని పిల్చే హక్కుంది."

"థాంక్యూ"

స్కూటర్ శోభారాణి రూమ్‌ముందరే ఆగింది. స్కూటర్ దిగాక "థాంక్స్" అని మరోసారి అంది. "మీపేరేవిటో చెప్పదులే హీరోగారూ?"

"సూర్యం" అని చిరునవ్వు నవ్వాడు. స్ట్రీట్‌లైట్ కాంతిలో ఆ నవ్వు చూసిన శోభారాణి గుండె ఝల్లుమంది!

"హల్లో బ్రదర్ పాంచాలి ఏమంటోంది" సూర్యం రూమ్‌లో అడుగుపెట్టగానే అడిగాడు శర్మ.

"ప్లీజ్........ దయచేసి ఇంక అలా అనొద్దురా!" దిమ్మెరపోయి చూశారు నలుగురూ!

సూర్యం భుజం మీద చెయ్యివేసి, "వాట్ గురూ..సంగతేవిటి? వ్యవహారం గానీ బెడిసిందా" అన్నాడు జోసఫ్.

సమాధానం చెప్పకుండా నిలబడిపోయాడు సూర్యం. జయరాజ్ సూర్యాన్ని కుర్చీలో కూర్చోబెట్టాడు, "చెప్పు బ్రదర్. ఆ రోజు రాత్రి శోభని స్కూటర్ మీద ఎక్కించుకుని ఇంటికి తీసికెళ్ళావ్.... ఆ తర్వాత ప్రతిరోజూ ఇంటి నుంచి ట్యూషన్‌కీ, ట్యూషన్ నుంచి ఇంటికీ తీసుకెళ్తున్నావ్.... మొన్న పిక్చర్‌కికూడా


ఎంతో అందం
ఎవ్‌లాన్
శ్రీ కుంకుం




మగువల అందానికి!
శ్రీ అందాన్ని పెంపొందించటానికి
ఖ్యాతిగల యితర ఎవ్‌లాన్
సౌందర్యసాధనాలు
నెయిల్ పాలిష్, కాంపాక్ట్,
ఫేస్ పౌడర్, టాల్కం పౌడర్,
రోగ్, ఐ-లైనర్

ఎవ్‌లాన్ కాస్మెటిక్స్
వినా దల్‌వాయి ఇన్‌డస్ట్రియల్ ఎస్టేట్,
యూనిట్ నం. 186/137, ఎస్. వి. రోడ్,
జోగేశ్వరి, బొంబాయి-400 060.

3 BROTHERS



అఖిలభారత పాపులర్ పోటీలో
ఆకర్షణీయమైన బహుమతులు గెలవండి!

ఎంట్రీ ఫీజు లేదు. ముగింపు తేదీ : 10-9-1977

సహాయమునకు 102 మొత్తముగల నమూనా

| | | | |
|---|---|---|---|
| 24 | 30 | 27 | 21 |
| 19 | 29 | 32 | 22 |
| 28 | 18 | 23 | 33 |
| 31 | 25 | 20 | 26 |

బహుమతులు వాచీలు. కెమెరాలు, టేపు రికార్డర్. రికార్డు ప్లేయరు, జపాన్ మోడల్ ట్రాన్సిస్టర్ (వీటిలో ఏదైనా తగ్గింపు బహుమతి ఒకటి) కన్సొలేషన్ బహుమతులు; అమెరికన్ డిజైన్ చీరలు లేదా టెరికాట్ పాంటుపీస్ తగ్గింపుధర రు. 70/లకు. మొదటి బహుమతి: ఇతర సొల్యూషన్లలో సరిపోలని దానికి ఇవ్వబడుతుంది. ఒకే విధంగా ఉన్న సొల్యూషన్‌కు కన్సొలేషన బహుమతి ఇవ్వబడుతుంది. ఇది ఒక సేల్సు ప్రమోషన్ పథకం. ప్రమోటర్ల తీర్మానము ఖాయమైనది. మరియు చట్టబద్ధమైనది.

తెల్లకాగితముపై పదహారు ఖాళీ గడులను తయారుచేసి 19 (పందొమ్మిది) నుంచి 34 (ముప్ఫై నాలుగు) వరకుగల అంకెలను ఒకేసారి ఉపయోగించి నిలువుగా, అడ్డముగా, అయిమూలగా ఎటు కూడినా మొత్తం 106 (నూట ఆరు) వచ్చునట్లు అమర్చాలి. ఫలితాలు ప్రకటించిన వెంటనే బహుమతి గెలిచినవారు ఆయా బహుమతులకు పోస్టేజి. ప్యాకింగ్ ఫీజులు డిపాజిట్టు చేయుటకు తెలియపర్చబడును. బహుమతులు గెలుపొందినట్లు పంపు ఉత్తరంలో తెలియపర్చబడిన పద్ధతికి లోబడి బహుమతులు పంచబడును. ఒక కుటుంబము ఒక ఎంట్రీ మాత్రమే పంపాలి. మొట్ట మొదటిగా చేరిన ఎంట్రీకి స్పెషల్ బహుమతిగా రు. 101/-లు నగదు ఇవ్వబడును.

M/s HINDUSTAN TEXTORIUM (A·J·W·)
Post Box No 1587, Delhi-110006.

తీసికెళ్ళేవ్. ఇన్నాళ్ళుగా సాగిస్తున్న వ్యవహారం ఇక్కడిదాకా ఎప్పుడొస్తుందంటే నాటకంలో పోర్షన్ మర్చిపోయిన హీరోలా అలా దిక్కులు చూస్తావేం?"

"సారీ.... గురూస్.... ఆ విషయం తప్ప మరేం మాట్లాడినా నేను వినటానికి సిద్ధమే" సూర్యం నవ్వుతూ అన్నాడు.

ఖాసిం కరుగ్గా అన్నాడు "ఎందుకని ఖాయ్?"

"నేనా అమ్మాయిని నిజంగా ప్రేమిస్తున్నాను కనుక!"

"ప్రేమించరా పార్టుడూ.... అందుకేగా నిన్ను నియమించేం. నీ డ్యూటీ నువ్వు చేసేయ్....ఇక ఆ బ్యూటీ పాంచాలి మాకు అప్పచెప్పడమే తరువాయి" అని శర్మ అంటుండగానే సూర్యం గట్టిగా అరిచాడు.

"ఇట్స్ ఇంపాసిబుల్."

"నాన్సెటాల్....మనం అయిదుగురం... మనలో ఎవరికన్నా ముందుకానీ, మగువ కానీ దొరికితే అది అయిదుగురికీ చెందాలి. మన స్నేహానికి కాంట్రాక్ట్ అది....మర్చిపోయావా? పాంచాలి మా పక్కలోకి వచ్చి తీరాలి" జయరాజ్ అతి నెమ్మదిగా, కరుగ్గా అన్నాడు.

"యసెస్" జోసఫ్, ఖాసిం, శర్మ ఒకేసారి అన్నారు.

"ఒరేయ్....కళ్ళు పేలిపోతాయిరా.... లెంపలేసుకోండి.... శోభన్నేను నిజంగా ప్రేమించాను. పెళ్ళి కూడా చేసుకోబోతున్నాను."

"మోసం!"

"దగా!"

"కుట్ర!"

"ఛీట్!" నలుగురూ ఒకేసారి అరిచారు.

సూర్యం వెంటనే అన్నాడు, "అవున్రా.... నిజమే.... మోసం, దగా, కుట్ర. ఛీట్ - ఇవన్నీ చేసి శోభారాణిని వల్లో వేసుకున్నాం.... కుట్రతో మీద్వారా శోభారాణిని పరిచయం చేసుకున్నాను.... ఆ పరిచయం కలగటానికి కారకులైన మీ నలుగుర్నీ బ్రాందీలో స్నానం చేయించినా ఋణం తీరదు. కానీ ఒరేయ్ ఒకటి మాత్రం నిజంగానే నిజం. నేను శోభారాణిని పెళ్ళి చేసుకోవటం మీరు బ్రతికున్నంత నిజం...."

ఖాసిం కళ్ళు ఎర్రబడ్డాయ్!

జోసఫ్ నీరసంగా కుర్చీలోకి జారాడు!

శర్మ పచార్లు చేస్తున్నాడు ఆలోచిస్తూ!

జయరాజ్ సూర్యాన్ని చొక్కా పట్టుకొని లేవదీశాడు "వెల్ సూర్యం.... నమ్మించి ద్రోహం చేశావ్. నీ స్వార్థం కోసం మమ్మల్ని రౌడీలుగా చిత్రించావ్.. నువ్వు చేసిన ద్రోహానికి నిలువునా నిన్ను చీల్చేసినా పాపం లేదు .... కానీ వెధవ స్నేహధర్మం అడ్డొచ్చింది.... గెటౌట్.. మళ్ళీ నీ ముఖం చూపించకు.... పో ఇక్కడ్నుంచి.... ఇంక నువ్వేం మాట్లాడకు.... ఐసే గెటౌట్...."

సూర్యం బైటికి వచ్చేశాడు. అతని ముఖం కందిపోయి ఎర్రగా వుంది. సిగరెట్ వెలిగించాడు. రూమ్ వంక అసహ్యంగా చూసి, "దుష్ట చతుష్టయం బాగా సరిపోయేరు" అని కాలరు సరిచేసుకుంటూ అడుగు ముందుకి వేశాడు.

సూర్యం చాలా మారిపోయాడు అనటం కంటే శోభారాణి సాహచర్యం అతన్ని మార్చేసింది అనటం బాగుంటుంది. సూర్యాన్ని ఇంతగా మార్చేసిన అమ్మాయిని కోడలుగా చేసుకోవటానికి అభ్యంతరం ఏమీ లేదన్నారు అతని తల్లీ.తండ్రి.

శోభారాణికి పరీక్షలయిపోయేయి. వాళ్ళ ఊరికి వెళ్ళిపోయింది. వెళ్ళగానే వాళ్ళ నాయనమ్మకి చెప్పి ఏ విషయం వెంటనే వుత్తరం రాస్తానని చెప్పి మరీ వెళ్ళింది.

* * *

మూడు రోజుల తర్వాత శోభారాణి దగ్గర్నుంచి చిన్న కవర్లో పెద్ద వుత్తరం వచ్చింది....

"సూర్యంగారికి,

నమస్తే! నేను క్షేమంగా చేరానంటే అది మీ చలవే...."

సూర్యం గుండెల్నిండా గాలి పీల్చుకుని మళ్ళీ చదవటం ప్రారంభించాడు.

"నేను గుంటూరికి వచ్చింది కేవలం చదువుకోవటానికి. అందుకే మా నాయనమ్మ వద్దంటున్నా ధైర్యంగా రూమ్ తీసుకున్నాను."

తన గుండెల చప్పుడు తనకే వినిపిస్తోంది సూర్యానికి.

"తన కూతురు వయసుదాన్ని నన్ను సినిమాకి రమ్మని అడిగేడు మా ఇంటి యజమాని. ఆయన ఏ వుద్దేశ్యంతో అడిగాడో ఆడదానిగా పుట్టిన నేను గ్రహించాను. ఆ విషయం ఆయన భార్యతో చెప్పాను. ఆయన మళ్ళీ నా జోలికి రాలేదు. ఒంటరిగా వున్న ఆ చుట్టుపక్కల ప్రతి పెద్దమనిషీ ఏదో విధంగా కదిలించారు.

పళ్ళు కొరికేడు సూర్యం.

"వీళ్ళందర్నీ ఎలా తప్పించుకోవాలా అని నేను సతమతమవుతున్న సమయంలో మరో నలుగురు రౌడీలు నా వెంట పడటం ప్రారంభించారు."

నవ్వుకున్నాడు సూర్యం! మిత్రులు గుర్తొచ్చి వాళ్ళమీద జాలిపడ్డాడు కాసేపు!

"పైన చెప్పిన పెద్ద మనుష్యుల్లా కాకుండా ఆ వెధవలు రోడ్డు మీదే, నాపైన అత్యాచారానికి పూనుకున్నారు. ఆ సమయంలో మీరు నన్ను కాపాడారు. నన్ను కాపాడేందుకే మీరటు వచ్చారేమో!"

సూర్యం సిగరెట్ వెల్గించాడు. "సారీ శోభా. డియర్....నిన్ను ఆ విధంగా ట్రాప్ చేసినందుకు నన్ను క్షమించు. మన తొలి రేయి దోసెడు మల్లెలు నీమీద చల్లి క్షమాపణ చెప్పుకుంటాను...."

"మీరు కూడా ప్రేమ పాఠాలు వల్లించారు. నాకు తెలియక అడుగుతాను మీ మగాళ్ళకి ఈ పాఠాలెక్కడన్నా కోచింగ్ ఇస్తారా?

ఆ పరిస్థితుల్లో నేనేం చెయ్యాలి! ఈ తెరచాటు పెద్దమనుష్యులూ, నడిరోడ్డు మీద రౌడీలు– వీళ్ళందరి బారినుంచి నన్ను నేను ఎలా కాపాడుకోవాలి? ఒక్క మొగవాడు పక్కన వుంటే వీళ్ళెవరూ నన్నేమీ అన్లేరనీ, అనరని అర్థం చేసుకున్నాను. అందుకే మిమ్మల్ని ప్రేమిస్తున్నట్టు నటించాను....."

సూర్యం, గుండెని ఎవరో నలిపేసినట్లు ఫీలయ్యాడు.

"చివర్లో. మీ సిన్సియర్ ప్రేమని చూస్తే జాలేసింది. మిమ్మల్ని లవ్ ట్రాప్‌లో ఇరికించినందుకు నామీద నాకే కోపం వచ్చింది. కానీ....కానీ....మిమ్మల్ని ప్రేమించలేక పోయాను. మిమ్మల్ని నా స్వార్థానికి వాడుకున్నందుకు నన్ను మీరు క్షమించరని తెల్సు .... అయినా చిన్న రిక్వెస్టు.... గడ్డంపెంచి మందు కొట్టేస్తూ తిరక్కండి.... మంచి అమ్మాయిని పెళ్ళి చేసుకోండి.... మీ నవ్వులో గొప్పమహిమ వుంది.... దాన్ని మీ శ్రీమతికి మాత్రమే సొంతం చెయ్యండి.... ....

సెలవా మరి

మీ స్నేహితురాలు

శోభారాణి."

సూర్యం మొదలు నరికిన చెట్టులా కూలిపోయాడు. ★

